## సిద్దిపేట సిపిని కలిసిన గౌరారం నూతన ఎస్ఐ



సిపి అనురాధకు పూల మొక్క అందజేస్తున్న ఎస్ఐ శివకుమార్

**వర్గల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్ సోమవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఆర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట ,ఫిబ్రవరి 19, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రజావాణిలో ఆర్జిదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తే వారికి అధికారులపై నమ్మకంతో పాటు న్యాయం చేసిన వాళ్ళమవుతామని అప్పుడే అధికారులపై విశ్వాసం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆయాశాఖల అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ఆర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, ఆసరా ఫించన్లకు సంబంధించిన మొత్తం 24 ధరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్యా, కలెక్టరేట ఎఓ అబ్దుల్ రహమాన్, జిల్లా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంగుపేట పాలిటెక్నిక్ కళాశాలలో ప్రహరీగోడ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



సంగుపేట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారంనాడు మండల పరిధిలోని సంగుపేట మహిళల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాలలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అంతకుముందు కళాశాలలో పర్యటించిన ఆయన పరిసరాలను పరిశుభ్రం చేయించాలని సూచించారు. అంతేకాకుండా కళాశాల ప్రహరీగోడ, సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనవెంబడి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఆర్డీవో పాండు, కళాశాల ప్రిన్సిపల్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దాలు బీరప్ప పండుగలు

### -మాజీ మంత్రి హరీష్‌రావు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు

**గజ్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రంలో బీరప్ప పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి గ్రామంలో జరిగిన చండీశ్వర కామరాతి బీరప్ప కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కురుమలు నీతి నిజాయితీపరులని, మాట తప్పనివారుగా కురుమలు ఉన్నారన్నారు. పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వంలో కురుమలకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. బీరప్ప దేవాలయాలు, ఫంక్షన్‌హాల్‌లు, కుల సంఘాల భవనాలు, ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. బీరప్ప కామరతి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నందుకు కురుమలకు శుభాకాంక్షలు తెలిపారు. కురుమల కోసం హైద్రాబాద్‌లో ఐదు ఎకరాల్లో అత్యాధునిక కురుమల ఆత్మీయ భవనం, దొడ్డి కొమురయ్య భవనం కెసిఆర్ కట్టించారన్నారు. ఉమ్మడి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు పుష్ప నగేష్‌యాదవ్ మాట్లాడుతూ అంగరంగ వైభవంగా ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిపే బీరప్ప పండుగ సమాజ హితం కోసమే అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాదగిరి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, స్థానిక కౌన్సిలర్ బబ్బూరి రజిత గౌడ్, హైకోర్టు న్యాయవాది రాజు, పులి బాల్‌చంద్రం, నాగయ్య, బీరయ్య, కనకయ్య, కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి, మాజీ సర్పంచ్ అయ్యాలం, సిహెచ్. లింగం,ఎల్లయ్య, బీరప్ప, కర్రోళ్ళ యాదగిరి, కన్నా, మహంకాళి నరేష్,బండారికిష్టయ్య, బొమ్మ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి హరీష్‌రావు

రాష్ట్రంలో ఎక్కడా లేని అభివృద్ధి గజ్వేల్‌లోనే జరిగిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు జరుపడం అభినందనీయమన్నారు. రేణుకా ఎల్లమ్మ దేవాలయంకు, ఫంక్షన్‌హాల్ కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు రూ.2 కోట్ల నిధులు విడుదల చేశారని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గజ్వేల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్‌దే అన్నారు. అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును పట్టణ గీతా కార్మిక సంఘం అధ్యక్షుడు లింగంగారి రాజాగౌడ్ శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కౌన్సిలర్ బబ్బూరి రజితగౌడ్, గౌడ సంఘం నాయకులు జంగం రమేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాజాగౌడ్, నరేష్‌గౌడ్, నక్క రాములుగౌడ్, రేగొండగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

### -సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :**
తొలగించిన ప్రభుత్వ అసుపత్రి ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కరోనాకాలంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరణ చేయకుండ విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు బాలనర్సయ్య, దాసరి ప్రశాంత్, శ ంకరయ్య, స్టాఫ్ నర్సు సిబ్బంది సంపత్, తార, గీత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కొమురవెల్లి గ్రామంలో రాజీవ్ రహదారి శివలింగం పక్కన జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి శనివారం వరకు 4 రోజుల పాటు అమ్మవారి జాతర నిర్వహించడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. 2002 నుంచి ప్రతి రెండు యేండ్లకోసారు సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరలో మొదటి రోజు సారలమ్మ గద్దెకు రాగా బుధవారం సమ్మక్క గద్దెకు వచ్చి ఇద్దరు అమ్మవార్లు శుక్రవారం భక్తులకు దర్శ నమిస్తారని నిర్వహకులు తెలిపారు.

## రైతుల దీక్షను అణచివేసే ధోరణిని కేంద్రం మానుకోవాలి

### -జేఏసి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ...




నిరసన ర్యాలీ దృశ్య ం

**హుస్నాబాద్, ఫిబ్రవరి19, ప్రభాతవార్త**
ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షను కేంద్ర ప్రభుత్వం అణచివేసే ధోరణిని మానుకోవాలని జేఏసి నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షకు సంఘీభావంగా నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 రకాల పంటలకు మద్దతు ధరను ప్రకటించాలని,వ్యవసాయ కార్మికులు,రైతులకు పెన్షన్లు,రెండు పంటలు పండే వ్యవసాయ భూములను కార్పోరేట్ సంస్థలకు అప్పగించకుండా ఉండాలని డిమాండ్ చేశారు.ఇవే డిమాండ్లతో ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు వారి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.గతంలో సైతం 13 నెలలు రైతులు దీక్షలో పాల్గొని 700 మంది రైతులు చనిపోయినా కేంద్రం పట్టించుకున్న పాపానపోలేద న్నారు.ఇప్పటికైనా స్పందించి చనిపోయిన రైతు కుటుంబాలకు ఆదుకోవడంతో పాటు అక్రమంగా వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.వారి సమస్యలను పరిష్కరించకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసి చైర్మెన్ కవ్వ లక్ష్మారెడ్డి,డిసిసి మెంబర్ కేడం లింగమూర్తి,జేఏసి కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్,నాయకులు ముక్కర సంపత్,మల్లేశం,బంక చందు,పచ్చిమట్ల రవిందర్‌గౌడ్,మైదంశెట్టి వీరన్న,పెరు మండ్ల నర్సాగౌడ్ పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంటలపై అడవిపందుల దాడి

### -ధ్వంసం అయిన పంటలను పరిశీలించిన ఏఓ
### -ఆదుకోవాలని అధికారులకు రైతుల వేడుకోలు



కుప్పానగర్‌లోఅడవి పందులు ధ్వంసం చేసిన ఆయిల్ ఫామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

**ఝరాసంగం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంటలపై అడవి పందులు దాడి చేసి పంటలను ధ్వంసం చేసి రైతులకు ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేశాయి. పంటలపై అడవి పందులు నిత్యం చేస్తున్న దాడులతో రైతులకు కంటి మీద కునుకు వేసే అవకాశం లేకుండా పోతున్నా పంటలపై దాడిని మాత్రం రైతులు ఆడ్డుకోలేకపోతున్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ గ్రామంలో పందులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. గ్రామానికి చెందిన చంద్రమ్మ 5 ఎకరాల్లో ఆయిల్ ఫామ్‌ను సాగు చేసుకుంటోంది. ఎకరాకు 57 మొక్కల చొప్పున సుమారుగా 285కు పైబడి మొక్కలను నాటుకుని పంటను సాగు చేస్తున్నారు. అడవి పందుల దాడితో సాగవుతున్న 70కి పైగా మొక్కలు ధ్వంసం అయ్యాయని బాధిత మహిళా రైతు చంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ధ్వంసం అయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుకునేందుకు 30వేలకు పైగా ఖర్చవుతుందని విచారం వ్యక్తం చేశారు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు 20వేల వ్యయం చేసి పంట చుట్టు సోలార్, శబ్దం కొరకు రెండు మైకులు బిగించుకున్నట్లు, అయినా పంటలను మాత్రం అడవిపందుల నుంచి కాపాడుకోలేకపోతున్నామని విస్మయం వ్యక్తం చేశారు.

అడవి పందుల నుంచి రైతులకు కాపాడేందుకు జంతు సంరక్షణ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని రైతులు వినతి చేస్తున్నారు. ఆగ్రికల్చర్ అధికారులు రైతులను ఆదుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వినతి చేస్తున్నారు.

## అభివృద్ధికి బాటలు వేయండి: ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టరు సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్, మనూరు, నాగల్‌గిద్దా మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీకార్యదర్శులతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభి వృద్ధికి బాటలు వేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు విడుదల చేయడంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వేసవి కాలం ప్రారంభసమయంలో ఆయా గ్రామాలోని ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడా లని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలు తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

### -స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు



పోలీసుల అదుపులో మత్తు పదార్థాలను తరలిస్తున్న వ్యక్తులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**
గోవా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న మత్తు పదార్థాలను సోమవారం ఉదయం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెట్ అధికారులు పట్టుకున్నారు. జహీరాబాద్ సమీపంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో రయ్ మంటూ అటుగా వచ్చిన కారును తనిఖీ చేయగా కారులో అక్రమంగా తరలిస్తున్న 4.2 గ్రాంస్ ఛార్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాంస్ ఛార్స్‌ను గంజాయి నుంచి తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. హైద్రాబాద్‌కు చెందిన అక్షిత్జ్ యాదవ్, ఆశిష్‌లను అదుపులోకి తీసుకుని, నిందితులను జహీరాబాద్ పోలీసు ఠాణాకు అప్పగించామన్నారు. జహీరాబాద్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ బృంధం, చెక్ పోస్టు సిబ్బంది, డీటీఎఫ్ బృంధం సభ్యులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు

## ముదిరాజ్‌లతో పెట్టుకుండు అందుకే కెసిఆర్ అధికారం కోల్పోయిండు

### -కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నీలం మధు ముదిరాజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

**గజ్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**
మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ ఎన్నికల ముందు ముదిరాజ్‌లను అవమానపరిచిండు కాబట్టే అధికారం కోల్పోయి అడ్రస్ లేకుండా పోయారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ విమర్శించారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్‌లో నీలం మధు ముదిరాజ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ముదిరాజ్‌లకు రాష్ట్రంలో సముచిత స్థానం ఇవ్వలేదని, ముదిరాజ్‌లు కన్నెర్ర చేసి బిఆర్ఎస్‌ను గద్దె దింపారన్నారు. ముదిరాజ్‌లకు కార్పోరేషన్ ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, ముదిరాజ్‌లను బిసి డి నుండి బిసి ఏకు మార్చడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. బిసి కుల గననతో బిసి డి నుండి బిసి ఏ అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముదిరాజ్‌లు బలోపేతం అవుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మనమంతా కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ముదిరాజ్‌లకు మంచి అవకాశాలు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను గుర్తించి సముచిత స్థానం అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు గుంటుకు శ్రీనివాస్, రొట్టెల శ్రీనివాస్, కొట్టాల చిరు, నరేష్, డాక్టర్ సత్యనారాయణ, రావుల రాజు, కనకయ్య, నర్సింలు, మన్నె వెంకటయ్య, సాయిబాబా, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ వాసులకు జాతీయ అవార్డుల ప్రదానం



జాతీయ అవార్డు పురస్కారాలు అందుకుంటున్న నర్సాపూర్ ప్రాంత అవార్డు గ్రహీతలు

**నర్సాపూర్,ఫిబ్రవరి 19.ప్రభాతవార్త:**
నర్సాపూర్ నియోజకవర్గంలో వివిద రంగాలలో సేవలిందిస్తున్నందుకుగాను వారివారి సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో పలు అవార్డు పురస్కారాలు అందించడం జరిగింది.ఈ మేరకు ఈ అవార్డులు హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వల్లూరి ఫౌండేషన్ అద్వర్యంలో స్వామి వివేకానంద ప్రగతి రత్న అవార్డు, సావిత్రి బాయి పూలే అవార్డు, నూతాజీ, గద్దర్‌అన్న జాతీయ అవార్డు పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈ జాతీయ అవార్డులను వల్లూరి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్, కేంద్రమాజీ మంత్రి వర్యులు సముద్రాల వేణుగోపాలచారి,ప్రముఖ అస్ట్రాలజీ దైవజ్ఞశర్మ, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, అడిషనలన ఎస్పీ శతావత్ నాయక్ ల చేతుల మీదుగా దండెపు శెట్టి గారి వినోద్‌కుమార్ కు హత్నూర జర్నలిస్ట్ శ్రీహరి లకు స్వామి వివేకానంద ప్రగతి రత్న అవార్డు,పల్లె నర్సింహ్మారెడ్డి కి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జాతీయ అవార్డు,దళిత రత్న అవార్డు గ్రహీత ఏర్పుల శ్రీనివాస్ కు ప్రజా యుద్ధ నౌక ప్రజాగాయకుడు గద్దర్‌అన్న అవార్డు, సీనియర్ న్యాయవాది స్వరూపరాణి కి సావిత్రిబాయి పూలే స్పెషల్ ఎక్సెలెన్స్ జాతీయ అవార్డు గౌరవ పురస్కారాలు అందుకోవడం జరిగింది.ఈ అవార్డులను అందుకున్న అవార్డు గ్రహీతలు అవార్డులు ఇప్పించినందులకు కృషి చేసిన వల్లూరి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ తదితర పెద్దలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హైందవ సోదరులు

**గజ్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పట్టణం మొత్తం కాషాయ జెండాలతో రెపరెపలాడింది. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. హైందవ సోదరుల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ ఉమామహేశ్వరాలయం నుండి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా పిడిచెడ్ రోడ్డులోని శివాజీ విగ్రహం వరకు పెద్దఎత్తున యువత నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో ర్యాలీ జరిగేందుకు అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ఎస్. మల్లారెడ్డి, గజ్వేల్ ఏసిపి బాలాజీల ఆధ్వర్యంలో గజ్వేల్ సిఐ సైదా, తొగుట సిఐ లతీఫ్‌ఖాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి, రూరల్ సిఐ మహేందర్‌రెడ్డితో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైందవ సోదరులకు గత రెండు రోజుల ముందే ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వడంతో యువత పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీలకతీతంగా ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి హరీష్‌రావు గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా పిడిచెడ్ రోడ్డులో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, స్థానిక కౌన్సిలర్ గంగిశెట్టి చందన రవీందర్, ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, రజితగౌడ్, డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, ఉప్పల మధుసూదన్, పేర్ల శ్రీనివాస్, మనోహర్‌యాదవ్, కన్నాయాదవ్, మర్కంటి కనకయ్య, ఎల్లం రాజు, ఆర్‌కె, మల్లేశంగౌడ్, మహేందర్‌రెడ్డి, గుంటుకు రాజు, నాగుముదిరాజ్, సందీప్, ల్యాబ్ రమేష్, టెంట్ నర్సింలు, చిరంజీవి, బాకి స్వామి, సుంకరి బాల్‌కుమార్ హైందవ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్

## ఘనంగా శ్రీపోచమ్మ తల్లి వార్షికోత్సవం

జీడిమెట్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త : ఎస్ఆర్ నాయక్ నగర్‌లో గల శ్రీ పోచమ్మ తల్లి దేవస్థానం 19వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు 130 డివిజన్ కార్పొరేటర్ హిమలత సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి : కొలను శ్రీనివాస్‌రెడ్డి



ఆలయ ముఖద్వారానికి భూమి పూజ చేస్తున్న కొలను శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త : ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కొలను శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ఉమామహేశ్వర స్వామివారి దేవస్థానంకు సంబంధించిన ఆలయ ముఖ ద్వారంకు సంబంధించిన కమాన్ భూమి పూజ సోమవారం ఉదయం 10.38గంటలకు ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా భూమి పూజ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, ఆలయ పూజారి శ్రీకాంత్‌చారి, నర్మదా, అర్జున, లక్ష్మణ్, దశరథ, ముత్యాలు, టైగర్ సత్తిరెడ్డి, ప్రేమ్‌కుమార్, కుమార్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, బిక్షపతి, రామ్‌చంద్రనాయక్, కొదమగుండ్ల అమృతయ్ (సన్నీ), వివి రమణ, సరిత, లక్ష్మీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : బిజెపి



సికింద్రాబాద్ డీసీని సత్కరిస్తున్న అడ్డగుట్ట బిజెపి నేతలు

అడ్డగుట్ట,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జీహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుభాష్ రావ్‌ను సోమవారం అడ్డగుట్ట బిజెపి నాయకులు సన్మానించారు. అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పెండింగ్ సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన దృష్టికి తెచ్చి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గాజుల హంసరాజ్, వేణుగోపాల్, నరేందర్, జి.ఉదయ్ యాదవ్, శివలింగం, శివాజీ, ప్రసాద్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## లింగంగౌడ్ త్వరగా కోలుకోవాలి

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



లింగంగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని గోల్నాకలోని తన నివాసంలో కోలుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగంగౌడ్‌ను సోమవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పరామర్శించారు. లింగంగౌడ్ త్వరగా కోలుకోవాలని తిరిగి యధావిధిగా నిత్యకార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, ఆర్.కె. బాబు, లక్ష్మణ్, సురేష్‌గౌడ్, జనార్ధన్ పాల్గొన్నారు.

## బేగంపేట ఫ్లై ఓవర్‌పై మరో ప్రమాదం

బేగంపేట ఫిబ్రవరి 19,ప్రభాతవార్త : బేగంపేట ఫ్లై ఓవర్ పైన సోమవారం తెల్ల వారు ఝామున మరో కారు ప్రమాదానికి గురైంది. బేగంపేట ఫ్లై ఓవర్ రెండుగా విడిపోతున్న ప్రాంతంలో ఎత్తు తక్కువగా ఉన్న డివైడర్ ను గుర్తించలేని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకోగా పలువురు గాయపడగా,కొందరు ప్రాణాలు కోల్పోయారు. అయినా అధికారులు మాత్రం ఈ సమస్యపైన దృష్టి సారించకపోవడం పై వాహనదారుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఫ్లై ఓవర్ పైన ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా, జీహెచ్ఎంసీ,ట్రాఫిక్ అధికారులు స్పందించకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని వెల్లడిస్తుంది. నిత్యం ముఖ్యమంత్రి,మంత్రులు, వీవీఐపీలు ప్రయాణించే ఈ ఫ్లై ఓవర్‌పైన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం తెల్లవారు ఝామున సికింద్రాబాద్ వైపు నుంచి గచ్చిబౌలీ కి వెళుతున్న టీఎస్ 07 యూఎమ్ 1920 కారు తెల్లవారు ఝామున గం 5.30నిల సమయంలో బేగంపేట ఫ్లై ఓవర్ పైన ఉన్న డివైడర్‌ను గుర్తించలేక ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న షామీర్‌పేట, హాకీంపేటకు చెందిన గౌతం (22)ప్రైవేటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గాయాల పాలయ్యాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు బేగంపేట ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రామయ్య దర్యాప్తు చేస్తున్నారు.

## మేడారం జాతరలో పర్యావరణాన్ని కాపాడాలి



క్లాత్ బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న హరి, భద్ర

సైఫాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: మేడారం జాతరలో పాల్గొనే రెండు కోట్ల మంది భక్తులు జీవవైధ్యాన్ని, జీవులను, వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ ఛైర్మన్ డా. ఇప్పనపల్లి హరి, అధ్యక్షుడు సి.హెచ.భద్ర విజ్ఞప్తి చేశారు. గత 12 సంవత్సరాలుగా పర్యావరణ సంస్థ చేస్తున్న సేవలను వారు అభినందించారు. పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు 'సేవ్ మేడారం-క్లిన్ మేడారం, క్లిన్ మేడారం సే నొటు ప్లాస్టిక్' వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ జాతరలో విచ్చలవిడి కాలుష్యాన్ని విడుదల చేయకుండా ప్లాస్టిక్‌ను ఎక్కడ బడితే అక్కడ పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్లాసిక్ నివారణ కోసం తమ సంస్థ ఉచితంగా లక్ష క్లాత్ బ్యాగ్‌లు ఉచితంగా పంపిణి చేస్తున్నామ వని వారు బ్యాగ్‌లను ఆవిష్కరించారు.

## ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ప్రకటన సిగ్గుచేటు

సైఫాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి పరిధిలో నిత్యం నడిచే వేలాది ఆర్టీసీ బస్‌లను ప్రభుత్వం మేడారం జాతరకు తరలించడంతో సోమవారం ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్‌లు చాలా తక్కువగా వచ్చాయి. కిక్కిరిసిన ప్రయాణికులతో బసులు నడిచాయి. ప్రయాణికులు చాలా సేపు బస్టాప్‌లలో బస్‌ల కోసం పడిగాపులు కాయవలిసి వచ్చింది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్దులు చెప్పలేనంత విధంగా ఇబ్బందులకు గురై అసహనం కోల్పోయారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ ఆరు వేల బస్సులను ప్రత్యేకంగా మేడారం జాతరకు పంపుతున్నామని ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రకటన చేయడం పట్ల ప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేశారు.

## హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో ఎడ్యూకేషన్ ఎమర్జెన్సీ తేవాలి

### తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం



విద్యారంగ సమస్యలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టిడిఎఫ్ ప్రతినిధులు

హైదరాబాద్,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త: హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో ఎడ్యూకేషన్ ఎమర్జెన్సీని తీసుకువచ్చి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యారంగ సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు అనేఅంశంపై రూపొందించిన డ్రాఫ్టురిపోర్టును టిడిఎఫ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ గాదె గోపాల్‌రెడ్డి, టిడిఎఫ్ యుఎస్‌ఏ ప్రెసిడెంట్ మధు.కె.రెడ్డి, టిడిఎఫ్ ఇండియా చైర్మన్ ఎమ్ గోనారెడ్డి, విశ్రాంత ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ శివారెడ్డి, తదితరులు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగ పరిస్థితి చూస్తే తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థులకు కనీసం అవగాహన లేకుండా విద్యావిధానం కొనసాగడం విచారకరమన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మూడవ తరగతి లెక్కలు కూడా చేయలేకపోతున్నారన్నారు. అలాగే పదవతరగతి పూర్తి చేసిన విద్యార్థులు కూడా లీవ్ లెటర్ కకూడా రాయలేని స్థితిలో ఉన్నారని ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలతో విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ నియంత్రణ లేనట్లు అర్థమవుతుందన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పోల్కం



బేగంబజార్, ఫిబ్రవరి 19ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఓబిసి సెల్ సీనియర్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖమంత్రి పోన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు దర్జీ కులస్థులను బిసి.డి. నుంచి ఏగ్రూపులోకి మార్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వన్నివంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి అదిమూల శంకర్,గంగారపు దశరత్,రైతు సంఘం చౌటుప్పల్ మండలం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, పొల్కం వినయ్‌రాజ్,మునగాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'అమర్ షహీద్ భగత్‌సింగ్' పుస్తకావిష్కరణ



జయసూర్య రచించిన 'అమర్ షహీద్ భగత్‌సింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: అశోక్‌నగర్ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక అశోక్‌నగర్ సాంస్కృతిక కేంద్రం నూతన భవన సముదాయంలో సాహితీ-సంగీత-సమ్మేళనం కార్యక్రమం అధ్యక్ష, కార్యదర్శులు బి.రామ్మూర్తి, బి.సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రచయిత జయసూర్య రచించిన 'అమర్ షహీద్ భగత్‌సింగ్' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కళారత్న బ్నిం, ప్రముఖ సాహితీవేత్త లక్ష్మణరేఖ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కవితామాధురి ఆధ్వర్యంలో 'సరాదా క్విజ్', మల్లిక, లక్ష్మి, శశిధర్ ఆధ్వర్యంలో సంగీత విభావరి, మాస్టర్ శశిధర్ ఆధ్వర్యంలో చిత్రకళాప్రదర్శన కార్యక్రమం సిహెచ్.కృష్ణ, కవితామాధురి ఆధ్వర్యంలో జరిగింది.

## నవతరానికి స్ఫూర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్





మహేంద్రహిల్స్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేత మల్క కొమురయ్య తదితరులు, శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులు అర్పిస్తున్న భరత్‌సింహారెడ్డి





ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గన్న డా.సత్యం శ్రీరంగం, శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాధవరం కాంతారావు



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసిన భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

**కంటోన్మెంట్..** ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం మహేంద్రహిల్స్ పికెట్ చౌరస్తా, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో బిజెపి నాయకులు నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

**పేట్‌బషీరాబాద్,.** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి రాఘవేంద్ర కాలనీలో ఆర్య క్షేత్ర సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి మేడ్చల్ అర్బన జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యక్షేత్ర సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఉమాపతిరావు, సుచిత్ర డివిజన్ అధ్యక్షుడు వి.రవీందర్‌రావు, ఆర్.చందర్‌రావు, కిసాన్‌రావు, మోహన్‌రావు, కుంట సిద్దిరాములు, మాధవరెడ్డి, సంపత్ మాధవరెడ్డి, జ్ఞానేశ్వర్, మధుసూధన్, నరసింహారెడ్డి, చక్రి, నరేందర్‌రెడ్డి, ఏళ్ల గౌడ్, నాగేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నార్ల కంటి దుర్గయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నాగదీప్‌గౌడ్, గజ, శ్రవణ్, అబిద్, నరేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీ..** ధైర్యానికి, దేశభక్తికి మారుపేరు, నవతరానికి స్ఫూర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలని ఎదరించిన ఛత్రపతి శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ముసాపేట్ జనతనగర్‌లోని శివాజి చౌక్ వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ 394వ జయంతి సందర్భంగా భజరంగ్ దళ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సత్యం శ్రీరంగం ముఖ్య అతథిా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హారీష్, స్థానిక నిర్వాహకులు రాము, సాయిగౌడ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీ..** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్క రించుకుని కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని కెపిహెచ్‌బి రోడ్ నెంబర్‌లో యోగేష్ ప్రభు ఆధ్వర్యంలో మూసాపేట్ మాణిక్ హరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా ఆయన నివాళులర్పించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు కాంతారావుని శాలువాతో తస్కరించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఎవరి పేరు చెబితే శత్రువులు భయపడిపోతారో ఎవరి పేరు చెబితే హిందూ మతంలో ఉత్సాహం ఉరకలెత్తుతుందో ఎవరిపేరు చెబితే గెరిల్లా యుద్ధం గుర్తుకొస్తుందో ఆయనే మరాఠా మహా యోధుడు ఛత్రపతి శివాజీగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకలు, బిజెపి నేతలు పాల్గొన్నారు.

**అప్జల్‌గంజ్..** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిన్ని పురస్కరించుకుని సోమవారం గౌలిగూడ శివాజీ బ్రిడ్జిపై ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి తెలంగాణ భజరంగ్ సేనా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం హిందు సామ్రాజ్యవాదం కోసం శివాజీ మహారాజ్ పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సేనా ప్రతినిధులు శ్రీనివాస్‌గుప్త, రంజనీశ్రీరామోజ్, శ్రీనివాస్, సునీల్ అగర్వాల్, మనోజ్‌వెుగులుగిద్ది, అభినవ్ తివారి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**జీడిమెట్ల..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం మహదేవపురం చౌరస్తాలో సోమవారం ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి టిపిసిస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కోలన్ హనుమంత్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం కమిటీ సభ్యులు, 125 డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలను అపహరిస్తున్న నిందితుల అరెస్ట్

### రూ,4లక్షల50 వేలు స్వాధీనం

దుండిగల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: గొర్రెలు, మేకలను దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా, జిన్నారం మండలం, చిలెపల్లి తండాకు చెందిన రాథోడ్ రాజు(45), రాథోడ్ సీతారామ్(26), బానోత్ శివాజీ(51), రాథోడ్ రాజేశ్(50), రాములు వీరందరూ స్నేహితులు. కలిసి తిరుగుతూ మద్యం పార్టీలు చేసుకుంటూ జల్సా చేస్తుండేవారు. రాథోడ్ రాజు వివిధ నేరాల్లో జైలు జీవితం గడిపి తిరిగి వచ్చాడు. జల్సాలకు డబ్బులు లేకపోవడంతో మిగితా స్నేహితులతో కలిసి అక్రమార్గాన సంపాదించుకునేందుకు గొర్రెలు, మేకలు దొంగతనాలు చేయడం మొదలు పెట్టారు. జీవాలు ఉన్న షెడ్ల వద్ద ఎవరు లేని సమయంలో, మేతకు వచ్చిన మందలలో గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకెళ్తుండేవారు. వాటిని తుఫాన్ వాహనంలో ఎక్కించుకొని బీదర్ మార్కెట్ సమీపంలో ఉన్న ఖానాపూర్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అదివారం భౌరంపేట ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా తుఫాన్ వాహనంలో అనుమానస్పదస్థితిలో గొర్రెలు తరలిస్తుండడంతో వారిని అడుగగా పొంతనలేని సమాధానం తెలపడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నేరాలు అంగీకరించడంతో వారి వద్ద రూ,4లక్షల50వేలు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి సోమవారం నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రాములు పరారీలో ఉన్నాడు. మూగజీవాలను అపహరిస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

### క్రిస్టియన్ జెఎసి ఉద్యమ కారుల రాష్ట్ర స్థాయి సదస్సు

సైఫాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: తెలంగాణ క్రిస్టియన్ జెఎసి ఉద్యమకారుల రాష్ట్ర స్థాయి సదస్సు త్వరలో రవీంద్రభారతిలో నిర్వహిస్తామని జెఎసి ఛైర్మన్ జిలకర రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ రాష్ట్ర ప్రభుత్వ సలహదారు వేం నరేందర్‌రెడ్డి సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

### ముషీరాబాద్ మండల ఉపవిద్యాశాఖాధికారి చిరంజీవి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్షలను పటిష్టంగా నిర్వహించబోతున్నట్లు ముషీరాబాద్ మండల ఉపవిద్యాశాఖాధికారి చిరంజీవి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాలయంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఆధ్వర్యంలో మారేడ్‌పల్లి మండల ఉపవిద్యాశాఖాధికారి బాలునాయక్, అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగరావుల సమక్షంలో సిఎస్, డిఓలకు పదవ తరగతి పరీక్షలకు సంబందిధించి శిక్షణ,అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్,ప్రిన్సిపాల్ విఠలాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుండి జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను విజయవంతం చేసే బాధ్యత సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియం ఇతర ఉన్నతాధికారులపైనే ఉంటుందని అన్నారు. ఏ చిన్న పొరపాటు చేసినా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ఆగమవుతాయని,నిర్లక్ష్యంగా వ్యవహారించిన అధికారుల పట్ల క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తెలంగాణ పునర్నిర్మాణము.. అభివృద్ధి దృక్పథాలపై

## ఈ నెల 26 నుంచి ఓయూలో జాతీయ సదస్సు

తార్నాక, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ సోసియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తెలంగాణ పునర్నిర్మాణము... అభివృద్ధి దృక్పథాలు అనే అంశంపై ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు నేషనల్ సెమినార్ డైరెక్టర్ ప్రొ.సి.గణేష్ తెలిపారు. ఈ నెల 26న ఒ.యూ ఆర్ట్స్ కళాశాలోని 133 హాల్లో ఉదయం 10 గంటలకు జాతీయ సదస్సు ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. గౌరవ అతిథులుగా వైస్ చాన్సనల్ ప్రొ.రవీందర్ యాదవ్, ప్రొ.కొదండరాం పాల్గొంటారని తెలిపారు.

## ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



వేడుకలలో పాల్గొన్న ఏసీపీ రవీందర్, ఇన్స్‌పెక్టర్ పరుశురాం,ప్రకాష్‌పాటిల్,మాజీ కార్పోరేటర్ అరుణాగౌడ్

బేగంపేట ఫిబ్రవరి 19,ప్రభాతవార్త : మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా తెలంగాణా గోల్డ్ అండ్ సిల్వర్ రిఫైనరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జనరల్ బజార్‌లో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా శివాజీ చిత్రపటానికి పలు వురు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం జనరల్ బజార్ ,సుభాష్ రోడ్,ఆర్పిరోడ్ బాటాల మీదుగా పాట్ మార్కెట్ వరకు జై శివాజీ,జైజై శివాజీ అంటూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఏసీపీ బీ.రవీందర్, ఇన్స్‌పెక్టర్ పరుశురాం,మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు నరసింగం సతీష్,ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, అసోసియేషన్ సలహాదారు ఉజ్జయినీ మహాకాళీ దేవస్థాన ధర్మకర్త జగదీష్ ప్రసాద్ వర్మ,కొసికె కిషోర్ కుమార్,అరుణ్‌భట్,మాజీ ధర్మకర్త మహేష్‌యాదవ్, సందీప్ వర్మలతో పాటు పెద్ద ఎత్తున మరాఠీయులు పాల్గొన్నారు.

### చర్యలు చేపడతాం: ఉత్తర మండల ట్రాఫిక్ ఎసిపి జి.శంకరరాజు

బేగంపేట ఫిబ్రవరి 19,ప్రభాతవార్త : బేగంపేట ఫ్లై ఓవర్ పైన ప్రమాదాలకు కారణమైన డివైడర్‌ను తాను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ జీ.శంకరరాజు ,ప్రభాతవార్త,కు తెలియజేసారు. జనవరి 6వతేదీ,జనవరి 27వతేదీన ఇదే ఫ్లై ఓవర్‌పైన జరిగిన ప్రమాదాలపై ప్రభాత వార్త హైదరాబాద్ మినీలో అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్నకారు, ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా,అనే కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ విషయమై ఏఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజును ప్రభాత వార్త వివరణ కోరగా పై విధంగా స్పందించారు.

## కంటోన్మెంట్‌కు సాయన్న సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే మల్లారెడ్డి



మాజీ ఎమ్మెల్యే సాయన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: దివంగత మాజీ ఎమ్మెల్యే కంటోన్మెంట్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి,సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాధించుకున్న ఏకైక వ్యక్తి సాయన్న అని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే సి.హెచ్. మల్లారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌లు తెలిపారు. సాయన్న ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కార్ఖానలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాధం, అనితా ప్రభాకర్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు తేజ్‌పాల్, పనస సంతోష్, వేణుగోపాల్ రెడ్డి, బి.నారాయణ, తేలుకుంట సతీష్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### 2వ వార్డులో ఘనంగా సాయన్న వర్ధంతి వేడుకలు

కంటోన్మెంట్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సాయన్న ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం 2వ వార్డు డబుల్‌బెడ్ కాలనీ వద్ద బిఆర్ఎస్ నాయకులు వంగ నరేశ్, రఫీక్, బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రఘురామ్, అంజనేయులు, నయీం, ధన్‌రాజ్, కుమార్ గౌడ్, జిలానీ, ఘపూర్, గౌస్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణతైలం వెలుగుతున్నంతవరకు నలుగురి కోసం వెలుగుతూనే ఉండేవాడే కవి

### ప్రముఖ గాయకుడు జయరాజ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: 'తెచ్చింది ఎవరు-ఇచ్చింది ఎవరు' పేరుతో తెలంగాణ ఉద్యమం ధగా చేయబడుతుందని పలువురు వక్తలు ఆవేధన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో "తెచ్చింది ఎవరు-ఇచ్చింది ఎవరు' పేరుతో ప్రముఖ గాయకుడు సుక్క రామ్‌నర్సయ్య ఆధ్వర్యంలో సభా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రముఖ గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ ప్రకృతి వెలిగించిన అందమైన దీపం లాంటిది జీవితం, ఇందులో ప్రాణతైలం వెలుగుతున్నంతవరకు నలుగురి కోసం వెలుగుతూనే ఉండాలన్నారు. కవి అనేవాడు అలా బ్రతకాలని, అలాంటి ఉన్నతమై ఆశయాల కోసం కవి ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాలుగుకోట్ల గొంతుల నినాదం, తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని వేలాది బిడ్డల ప్రాణ త్యాగాలని, ఒక వ్యక్తికో లేదా ఒక పార్టీకో కట్టబెడుదామా అరవై ఏండ్ల పోరాటాన్ని నిర్వీర్యం అవుతుంటే చూస్తూఊరుకోవద్దన్నారు. తెలంగాణ మట్టి కాదు, తెలంగాణ అంటే ప్రాణాలను సైతం లెక్కచేయ్యని యుద్ధభూమిగా మాట్లాడుతుందని అన్నారు. తెలంగాణ ప్రజలంతా మేల్కొని నిజాలుమాట్లాడుకోవడంతో పాటు త్యాగాల గొంతులెత్తాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రముఖ సినీ దర్శకులు శంకర్ పాల్గొన్నారు.

## చేర్యాల తహసీల్దారుగా సమీర్ అహ్మద్ ఖాన్

**చేర్యాల,ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

చేర్యాల తహశీల్దారుగా సమీర్ అహ్మద్ ఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో విధులు నిర్వహించిన ఆయన చేర్యాల తహశీల్దారు కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఎన్నికల ముందు చేర్యాలకు వచ్చిన తహశీల్దారు జె. రాజేశ్వర్‌రావు సిద్దిపేట కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. అంతకు ముందు కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దారుతో పాటు బదిలి అయిన తహశీల్దాను శాలువాలతో సన్మానించారు.

## మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ ఔధార్యం

**రాయపోల్,ఫిబ్రవరి19 ప్రభాతవార్త**

దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్‌నగర్ గ్రామానికి సుమారు 200 కుర్చీలను మాజీ ఎమ్మెల్సీ పారుక్‌హుస్సేన్ అదేశాల మేరకు బీఆర్‌ఎస్ మండలఅధ్యక్షులు రణం శ్రీనివాస్‌గౌడ్ వారికి అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గతంలో హైమద్‌నగర్ పర్యటనలో భాగంగా ఫారుక్‌హుస్సేన్‌ఇచ్చిన మాట ప్రకారం 200 కుర్చీలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. సేవగుణం కలిగిన ప్రతి ఒక్కరు సేవ చేయాలని ప్రజలలో గుర్తింపు తెచ్చుకోవాలనిధనం కన్న గుణం ముఖ్యమని, గత నెల క్రితం ఆనారోగ్యానికి గురి అయినటువంటి ఫారుక్‌హుస్సేన్ త్వరగా కోలుకొని ప్రజలకు మరిన్ని సేవలు చేయాలనిభగవంతుని కోరుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీల ఫోరం మండల అధ్యక్షులు బండారు దేవేందర్, కో ఆప్షన్ హైమద్,ఎంపీటీసీ తిరుపతి,రవి, మంజూరు మోల్‌సాబ్, పాషా, రఫీ, ఆలీ,పటాన్, ఆలీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోటుబుక్స్, ప్యాడ్స్ అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

**ములుగు, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

ములుగు మండల పరిధిలోని జప్తిసింగాయిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నీలం ప్రభాకర్‌రెడ్డి సోమవారం నోటుబుక్స్, పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు తన జన్మదినం సందర్భంగా నోటుబుక్స్, పరీక్ష ప్యాడ్స్ అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దాత ప్రభాకర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సిహెచ్.నరసింహారెడ్డి, ఎన్.ప్రతీప్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందరం వీర శివాజీ చూపిన బాటలో నడుద్దాం

### -ఎంపిటీసీ గురజాడ బాలాజీ



శివజీ విగ్రహన్ని అవిష్కరిస్తున్న ఎంపిటిసి గురజాడ బాలాజీ

**కొండపాక, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

చత్రపతి శివాజీ మహారాజ్ చూపిన బాటలో అందరం నడవాలని ఎంపిటిసి గురజాడ బాలాజీ సూచించారు. సోమవారం దుద్దెడ శివారులోని రాజీవ్ రహదారి పై టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహన్ని దుద్దెడ అరె క్షత్రియసంక్షేమ సంఘం అధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు ఎంపిటిసి బాలాజీ అవిష్కరించి మాట్లాడారు. సర్వమత సహనంతో, అన్ని వర్గాల ప్రజలను ప్రేమంతో అక్కున చేర్చుకున్న గొప్ప రాజు శివాజీ అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యకి అన్నారు. దోపిడి పాలన నుండి ప్రజలను విముక్తి చేసని మహారాజ్ శివాజి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అరెపల్లి మహదేవ్, వాసరి లింగరావు, బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, కొండ్ర రవీందర్, పిఎసిఎస్ డైరెక్టర్ సురేందర్, కనకరావు, బజరంగ్ దళ్, హిందు వాహిని సభ్యులు, అరెపల్లి, అంకిరెడ్డిపల్లి, జప్తినాచారం, వెలకట్ట గ్రామాల శివాజీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగ కుకునూరుపల్లి మండల కేంద్రంలో చత్రపతి శివాజీ యూత్ అధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చత్రపతి శివాజీ యూత్ సభ్యులు, ఉమ్మడి కొండపాక మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రాజు, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవత విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం



ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపిటీసిల ఫోరం వరి కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

**కొండపాక, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

కుకునూరుపల్లి మండల పరిధిలోని మాత్‌పల్లిలో సర్పంచ్ బచ్చలి మహిపాల్ అధ్వర్యంలో సోమవారం గ్రామంలో హనుమన్, శివలింగం, పోచమ్మతల్లి దేవత విగ్రహల ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పాల్గొని పూజలు నిర్వహించి అశీర్వాదం తీసుకున్నారు. అదే విధంగా ఎన్‌అర్ ఈజిఎస్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యురాలు కొల సద్గున దంపతులు పాల్గొని అశీర్వాదం తీసుకున్నారు.

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

**సిద్దిపేట ,ఫిబ్రవరి 19, ప్రభాతవార్త ప్రతినిధి**

రిజర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 1వ తేది వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా స్థాయిలో పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాల్లో పోటీలను పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విదా ్యర్థుల వయస్సు 10 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలని సూచించారు. విద్యార్థిపేరు, పాఠశాల లేదా కళాశాల పేరు, ఫోన్‌నంబర్ తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. ఈ మూడు పోటీలలో విజేతలకు బహుమతి, సర్టిఫికేట్ ప్రధానంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు లీడ్ బ్యాంక్ కార్యాలయం జిల్లా కలెక్టరేట్, దుద్దెడ గ్రామం చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

# దొంగ ఓట్లతో గెలిచినట్లు నిరూపిస్తా...చర్చకు సిద్దమా...

**-ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి**

**చేర్యాల,ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

అసెంబ్లీ ఎన్నికల్లో నాపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో గెలిచాడని నైతికంగా నాదే విజయమని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం చేర్యాలలోని కొమ్మూరి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలో సుమారు 18వేల ఓట్లు ముక్కు, మొకం తెలియని వారిని నమోదు చేయించి దొంగ ఓట్లతో గెలుపొంది ఇవ్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యనని తిరగడం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్లతో గెలిచినట్లు నిరూపిస్తా పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చకు సిద్దమానని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సవాల్ విసిరాడు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కొరకు నిరంతరం సేవచేస్తా, నియోజకవర్గానికి అన్ని రకాలుగా నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నరేందర్...**

**అప్పుడు అక్రమ కేసులు, బెదిరింపుల భయంతోనే బీఆర్‌ఎస్ పార్టీలో చేరా...**

సుమారు 10 సంవత్సరాల క్రితం కాంగ్రెస్‌లో ఉన్న తన కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ అనేక రకాలుగా అక్రమంగా కేసులు, బెదిరింపులకు గురిచేయడంతో ఆ పార్టీలో చేరామని కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం సమక్షంలో కొమురవెళ్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య తన కుమారులు చేర్యాల మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్, ఆడెపు మహేష్‌తో పాటు మాజీ గ్రంథాలయం చైర్మన్ నాగుల వెంకటేశం, సుమారు 200 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో చేరినప్పటి నుండి నాకుటుంబానికి సముచిత స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికి పార్టీ ఆదేశాల మేరకు అప్పటి ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు వార్డు ప్రజలకు వెన్నంటి ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన గుర్తింపులేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా యూత్ అధ్యక్షులు బనుక శివరాజ్, పిఏసిఎస్ డైరెక్టర్ కొమ్మురవి,చేర్యాల పట్టణాధ్యక్షులు మంచాల చిరంజీవులు, పూర్మ ఆగంరెడ్డి, ముస్త్యాల యాదగిరి, బందెల మహిపాల్‌రెడ్డి, దాసరి శ్రీకాంత్, సనాధి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి కౌన్సిలర్ నరేందర్‌ను ఆహ్వానిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

# ఈకేవైసీ ఉంటేనే కిసాన్ సమ్మాన్

**-మొబైల్ ఫోన్‌లలోనూ రైతులు సరిచేసుకునే అవకాశం**

**-తప్పులు సరిచేసుకునేందుకు అధికారులను సంప్రదించాలి**

**-సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్**

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

రైతులు ఈకేవైసీ చేసుకుంటేనే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వర్తించనుందని, లేకుంటే రైతులకు ఈ పథకం కింద వచ్చే పిఎం కిసాన్ డబ్బులు రావని, లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి కె.శివప్రసాద్ అన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులు అయిన రైతులు తమ ఈకేవైసీ స్టేటస్ తెలుసుకునేందుకు పిఎం//కిసాన్.జిఓవి.ఇన్ ఫార్మర్ కార్నర్‌లో తెలుసుకోవచ్చుని, ఈకేవైసీ లేనట్లయితే వెంటనే రైతులు చేసుకోవాలని సూచించారు. ఈకేవైసీ ఉంటేనే ఎకరానికి రూ.2వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఇప్పటికే రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకొని ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఒకవేళ ఆ ప్రక్రియ చేసుకోని రైతులు తమ మొబైల్ ఫోన్‌లో క్రోమ్ బ్రౌజర్‌లో పిఎం కిసాన్ వెబ్‌సైట్‌కు వెళ్ళి పిఎం//కిసాన్.జిఓవి.ఇన్ లాగిన్ అయితే అక్కడ ఈకేవైసీ అనే ఆప్షన్ ఉంటుందని, దీని ద్వారా రైతులు తమ ఈకేవైసీని పూర్తి చేసుకోవచ్చుని, దీని కోసం ఆధార్‌కు జతపరిచిన మొబైల్ నెంబర్ ఖచ్చితంగా రైతుల వద్ద ఉండాలని అప్పుడే ఆన్‌లైన్‌లో ఓటిపి నెంబర్లు నమోదు చేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చుని అన్నారు. ఒకవేళ మొబైల్ నెంబర్‌తో ఆధార్ లింక్ కాకుంటే బయోమెట్రిక్ ద్వారా లేదా ఫేస్ ఆప్ ద్వారా కూడీ చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను గానీ మండల వ్యవసాయాధికారులను గానీ సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి సూచించారు. ఈ పథకం కింద ఎవరైనా రైతులు సెల్ఫ్ రిజిస్ట్రేషన్ లేదా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా కానీ నమోదు చేసుకున్న తర్వాత రైతుల ఖాతాల్లో ఇంకా డబ్బులు జమ కానట్లయితే పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్సు ప్రతులతో సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను లేదా మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. ఫార్మర్స్ కార్నరల్ ఆధార్ వెరిఫికేషన్ స్టేటస్ పెండింగ్ అని చూపించినట్లయితే వెంటనే పిఎం//కిసాన్.జిఓవి.ఇన్ లో లాగిన్ అయ్యి ఎడిట్ ఆధార్ ఫెయిల్యూర్ రికార్డ్స్ ఆప్షన్ ద్వారా సరి చేసుకోవాలని ఆ తర్వాతనే పిఎం కిసాన్ పథకం కింద అందే రూ.2వేల నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అదేవిధంగా బ్యాంకు వివరాలు తప్పుగా నమోదు కావడం, ఇతర కారణాల వల్ల డిబిటి ఫెయిల్ లేదా పిఎఫ్‌ఎంఎస్ రిజెక్షన్ అని వచ్చిన వెంటనే బ్యాంకు ఖాతా పుస్తకం ఆధార్ కార్డులో బ్యాంక్ అధికారులను సంప్రదించి ఆధార్ సీడింగ్ చేసి ఎన్‌సిపిఐ మ్యాపింగ్ చేపించుకోవాలని సూచించారు. ఈ పథకం కింద నమోదు కావడానికి రైతులు 2019 ఫిబ్రవరి 1 నాటికి పట్టాదారులై ఉండాలని, కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకంలో లబ్ధి చేకూరుతుందని అన్నారు. అదేవిధంగా మైనర్‌గా ఉన్నట్లయితే కొడుకు, కూతురు పేర్లను వేర్వేరుగా నమోదు చేయించరాదని ఇన్‌కం టాక్స్ చెల్లిస్తున్న వారు ప్రొఫెషనల్స్ ఉద్యోగస్తులు మొదలైన వారికి ఈ పథకం వర్తించదని వివరించారు.

**ఈకేవైసీకి ఈనెల 21 చివరి తేదీ**

రైతులు పిఎం కిసాన్ పథకం పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరి కాబట్టి ఈకేవైసీ చేసుకోని రైతులు ఈనెల 21వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీ పెండింగ్ ఫిబ్రవరి 12 నాటికి 2625 ఉండగా ఇప్పటి వరకు 1888 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని, ఇంకా మిగిలిన రైతులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

## అనాథ పిల్లలకు నీలం మధు ఆపన్నహస్తం

**-ముగ్గురు పిల్లలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం**

**గజ్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన నీరుడి భాస్కర్ డ్రైవర్‌గా పనిచేస్తూ గ్రామంలో మస్కూరి పని చేసేవాడు. ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మరణించగా భాస్కర్ భార్య కవిత మస్కూరిగా విధులు నిర్వహించింది. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భాస్కర్ మరణించడంతో పిల్లలకు కవిత అన్నీ తానై వ్యవహరిస్తూ విఆర్‌ఏగా ఉద్యోగం చేస్తూ పిల్లలను పోషించుకుంటుంది. అయితే కవిత సైతం తీవ్ర అనారోగ్యానికి గురై కన్నుమూసింది. దీంతో ముగ్గురు పిల్లలు కావ్య(6), శ్రీవాణి(4), కుమార్(18)లు అనాథలై రోడ్డున పడ్డారు. కవిత కుటుంబసభ్యుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం ఉండడంతో గత నాలుగైదు రోజుల నుండి వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు నీలం మధు ముదిరాజ్ అండగా నిలిచి చిన్నారులకు ఒక్కొక్కరికి 50వేలు బ్యాంక్‌లో ఫిక్సిడ్ డిపాజిట్ చేపిస్తానని చెప్పి తక్షణ సహాయంగా రూ.50వేల నగదు అందజేశారు. లక్షా 50వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేయించాలని కొల్గూరు గ్రామస్తులను కోరారు. అంతేకాకుండా పిల్లల బాగోగులు చూసుకోవడంతో పాటు వారి చదువు కోసం తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రాంతంతో సంబంధం లేకుండా నీలం మధు ముదిరాజ్ చిన్నారుల కష్టం తెలుసుకొని పరామర్శించి అండగా నిలబడడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మల్లం రాజు, ఎంపిటిసి స్వామి, గుంటుకు శ్రీనివాస్, రొట్టెల శ్రీను, డాక్టర్ సత్యనారాయణ, రావుల రాజు, కనకయ్య, నర్సింలు, మన్నె వెంకటయ్య, సాయిబాబా, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సబ్బుబిళ్లపై శివాజీ మహారాజ్ చిత్రం

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 19**

**(ప్రభాతవార్త):**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర స్థాయి కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు సబ్బు బిళ్లపై శివాజీ మహారాజ్ చిత్రాన్ని చిత్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుని గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడు ఛత్రపతి శివాజీ అన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు, ఓటమి ఎరుగని ధీరుడు అన్నారు. దైవభక్తికి మహిళల పట్ల అకుంటిత భావం కలిగిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ అన్నారు.



సబ్బు బిళ్లపై శివాజీ మహారాజ్ చిత్రం

## సాగునీటి కోసం మోటార్‌ను అందజేసిన విజయేందర్‌రెడ్డి



మోటారుకు పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ విజయేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలో బూర్గుపల్లి కెనాల్ నుండి రైతులకు సాగునీరు అందించడానికి గ్రామ రైతుల కోరిక మేరకు గ్రామ మాజీ సర్పంచ్ వంటేరు విజయేందర్‌రెడ్డి తన సొంత నిధులు లక్షా 30వేల ఖర్చుతో 10 హెచ్‌పి బోరు మోటార్ కొనుగోలు చేసి రైతులకు అందజేశారు. కెనాల్ నుండి నీటిని బూర్గుపల్లి గ్రామ చెరువులోకి మోటార్ ద్వారా తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 10 హెచ్‌పి మోటార్‌ను విజయేందర్‌రెడ్డి రైతులకు అందివ్వడం అభినందనీయమన్నారు.

## గజ్వేల్ ఏసిపిని కలిసిన జిపిపి డిపో మేనేజర్



ఏసిపి బాలాజీకి పుష్పగుచ్చం అందజేస్తున్న జిపిపి డిపో మేనేజర్ సురేఖ

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

గజ్వేల్ నూతన ఏసిపిగా బాధ్యతలు స్వీకరించిన బాలాజీని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసిపి బాలాజీకి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్ ఉన్నారు.

## శివాజీ జీవితమే స్ఫూర్తిదాయకం



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం మనందరికి ఓ స్ఫూర్తి దాయకం, ప్రేరణ అని గీతం విశ్వవిద్యాలయం, హైదరబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు అన్నారు. హైదరబాద్‌లోని గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయంలో శివాజీ 394వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలో నెలకొల్పిన శివాజీ మహరాజ్ విగ్రహానికి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ, గొప్ప పరిపాలకుడిగా, ఉదార, పౌర పాలన స్థాపకుడిగా కీర్తిని పొందారని చెప్పారు. ఆయన గాథలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. గీతం రెసిడెంట్, డైరెక్టర్ డీవీవీఓస్ ఆర్ వర్మ, ఎన్‌ఎస్‌ఎస్, స్టూడెంట్ లైఫ్ సమన్వయ కర్తలు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఈ జయంతి వేడుకలలో పాల్గొని శివాజీ మహారాజ్‌కు ఘన నివాళ్లి అర్పించారు. ఆయన విజయ గాథలను స్మరించుకున్నారు.

## కార్మికుల శ్రమదానాన్ని దోచుకుంటున్న కాంట్రాక్టర్‌లు

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:**

పరిశ్రమలో పనిచేసే కార్మికుల శ్రమదానాన్ని కాంట్రాక్టర్‌లు దోచుకుంటున్న బొల్లారం ఐఎన్టీయుసి అధ్యక్షులు జె శివసాయి తీవ్రంగా ఖండించారు. పారిశ్రామిక వాడలోని ఏ పరిశ్రమలో అయినా కార్మికులు ఒక్కరోజు పనిచేసిన వాళ్ళ జీతం అందచేయలని, బొల్లారం ఐఎన్టీయుసీ అధ్యక్షులు జె శివసాయి కాంట్రాక్టర్‌లను కోరారు. పరిశ్రమల్లో ఇలా ఒక రోజు, రెండు, మూడు రోజు, ఇలా పది రోజులు పనిచేసి పరిశ్రమకు వెళ్లని కార్మికుల శ్రమదానాన్ని కాంట్రాక్టర్‌లు దోచుకుంటున్నారని జె శివసాయి మండి పడ్డారు. ఇప్పటి నుండి ఇలా కార్మికుల శ్రమదానాన్ని దోచుకోకుండా కార్మికులు ఒక్క రోజు పనిచేసిన వాళ్ల జీతాన్ని వాళ్లకు అందచేయాలని కాంట్రాక్టర్‌లకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ కార్మికుల జీతాన్ని వాళ్లకు అందచేయని కాంట్రాక్టర్‌లు ఎవరైనా సరే కార్మికులను ఇబ్బంది పడితే వాళ్ల గురించి పరిశ్రమ దృష్టికి తిసుకెళ్లి వాళ్ల కాంట్రాక్టు రద్దు చేసే విధంగా పోరాడుతామని హెచ్చరించారు. ఇప్పటికైన కాంట్రాక్టర్‌లు వాళ్ళ పనితీరు మార్చుకొని కార్మికుల జీతాన్ని వాళ్లకు అందచేయాలని వాళ్లకు బొల్లారం ఐఎన్టీయుసి అధ్యక్షులు జె శివసాయి కోరారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చిన్నశంకరంపేటతో పాటు మండల పరిధిలోని గ్రామాలైన వెంకట్‌రావుపల్లి, కురుమపల్లి,ఖాజాపూర్, ధర్పల్లి, తదితర గ్రామాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలోని పుర వీధుల గుండా ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ఊరెగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో బిసి ఫంక్షన్‌హాల్, బిసి భవన్,స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

**హుస్నాబాద్,ఫిబ్రవరి19,ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకరవ్గ కేంద్రంలో బిసి ఫంక్షన్‌హాల్‌తో పాటు బిసి భవన్, బిసి స్టడీ సెంటర్,కళ్లు గీత కార్మిక సంఘం భవనం ఏర్పాటు చేయాలని బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ రాష్ట్ర బిసి సంక్షేమ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్టి, మైనార్టీలకు వారికి కావాల్సిన భవనాలు మంజూరు చేసి బిసిలను మట్టించుకున్న పాపానపోలేరన్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెల్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గట్టు సాయి,దుద్దెడ రాజేష్,పెరుమండ్ల భరత్‌గౌడ్,వేణు,పాల్గొన్నారు.

## ఏపీజీవీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

కొమురవెల్లి మండల కేంద్రంలో ఏపిజీవీబీ బ్యాంకు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ బ్యాంకులో పాస్ బుక్ ప్రింటింగ్ సేవలను బ్యాంకు మేనేజరు మల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఏపీజీవీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా హైరిక్స్ ఇంచార్జి శంకర్, జోగు నాగరాజు, కుమార్,భాను, శ్యామల, మినీ బ్యాంక్ నిర్వహకురాలు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:**

మండలంలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరేపల్లిలోని శివాజీ విగ్రహానికి అరే క్షత్రియ సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరేపల్లి నుంచి మిరుదొడ్డి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ధర్మారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి యువజన సంఘం సభ్యులు బిజెపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల్పర్పించారు. అయా కార్యక్రమాలలో చిప్ప శివకుమార్, అర్జున్‌రావు, రజనీకాంత్,రాజేశ్వరరావు, రాజు, నర్సింగరావు, భూపతిరావు, అనిల్, పద్మారావు యాదన్‌రావు, రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వరి పైర్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### -ఏఓ నాగేందర్‌రెడ్డి



మర్కుక్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగేందర్‌రెడ్డి

**మర్కుక్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

ప్రస్తుతం వరి పైర్లలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మర్కుక్‌లో వరి పంటపొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాటిన పది నుంచి పదిహేను రోజుల మధ్యలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 4 కిలోలు లేదా ఫ్లూబెండమైడ్ గుళికలు 5 కిలోలు లేదా పిప్రోనిల్ 6 కిలోల గుళికలు 10 కిలోల ఇసుకలో కలిపి తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. వరిపైర్లు గంధక దుష్ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వరి సాగు విషయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని, ఏమైనా అవసరమైతే అధికారులను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణాధికారి రజినీకాంత్, విష్ణువర్ధన్, రైతులు ఉన్నారు.

## సమగ్ర కులగణన చారిత్రాత్మక నిర్ణయం

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అయిలేష్ యాదవ్**



మాట్లాడుతున్న అయిలేష్‌యాదవ్

**హుస్నాబాద్,ఫిబ్రవరి19,ప్రభాతవార్త**

సమగ్ర కుల గణన అనేది చారిత్రాత్మక నిర్ణయం అని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేష్‌యాదవ్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెరుమండ్ల నర్సాగౌడ్,బిసి సంక్షేమ సంఘం నాయకులు బొలిశెట్టి శివయ్య, జెఏసి నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ 93 ఏండ్ల క్రితం హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన కుల గణన మరల తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ హయాంలో జరుగుతుండడం శుభపరినామం అన్నారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకుని కేంద్రంలో సైతం దేశ వ్యప్తంగా కుల గణనకు తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని,పార్లమెంట్‌లో జ్యోతిబాపూలే,బిపి మండల్ విగ్రహాలను నెలకోల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి మెంబర్ కేడం లింగమూర్తి,అక్కు శ్రీనివాస్,బంక చందుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ శివకుమార్‌ను సన్మానించిన తుమ్మ గణేష్

**వర్గల్, ఫిబ్రవరి 19 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌ను సోమవారం మండల బిఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మ గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



గాందారిపల్లిలో నవగ్రహ విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న శేరి సుభాష్‌రెడ్డి

## ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

### ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

**పాపన్నపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గాంధారిపల్లిలో నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిని ఆలయ కమిటి బాధ్యులు ఘనంగా స్వగతం పలుకగా ఎమ్మెల్సీ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో సైతం ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఔదత్‌పూర్‌లో యల్లాలింగేశ్వర జాతర

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



యల్లాలింగేశ్వర జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఔదత్‌పూర్‌లో మచ్చేందర్‌నాథ్ మహారాజనమఠంలో నిర్వహించిన యల్లాలింగేశ్వర జాతర ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. జాతర ఉత్సవాలకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యేను మహారాజ్ శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పండరియాదవ్, యువ నాయకులు లక్ష్మణ్‌నాయక్, గ్రామ మాజీసర్పంచ్ రాజ్‌కుమార్, నార్సింగ్‌రావు, గ్రామ రైతు సమన్వయ సమిత అధ్యక్షులు జలీల్, నాయకులు అజయ్ పాటిల్, సుభాష్‌పాటిల్, శివరాజ్, జగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

## ముక్తాపూర్‌లో ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



ఫిలింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపి సురేష్‌శెట్కార్

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముక్తాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ను మాజీ ఎంపి, టిపిసిసి ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్ శెట్కార్, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డిలు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు బాపు మల్‌శెట్టి, కురుమ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరైన అతిథులను స్టేషన్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## తంప్లూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



తంప్లూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంప్లూర్ గ్రామ లో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన జయంతిని పురస్కరించుకొని టేక్మాల్, బొడ్మట్‌పల్లి గ్రామాల మీదుగా తంప్లూర్ గ్రామస్తులు జైశివాజీ, జైభవాని అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. తంప్లూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శ్రీశ్రీమహంత్ రాహుల్‌దాస్‌బాబా స్వామిజీ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ దేశభక్తుడిగా, శత్రువుకు తలవంచని ధీరుడిగా, హిందూ ధర్మ పరిరక్షకుడిగా, పరమత సహనం గలిగిన ఉదారవాదిగా గొప్ప మానవీయ విలువలకు ప్రతీకగా కనిపిస్తాడన్నారు. అన్నధాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు కొండ రమేష్, మల్లేశం, బసంత్‌రావు, సంగయ్య, రవిబాబు, సతీష్, శేఖర్, నాగయ్య, రమేష్, సాయిలు, సంతోష్, శివాజీ యూత్ సభ్యులు, పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో నడుచుకోవాలి

### ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో మరాఠాలు భక్తిశ్రద్దలతో నడుచుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణంలో శివాజీ చౌక్‌వద్దగల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుచుకుని ముందుకు సాగాలని అన్నారు. దేవుని దృష్టిలో అందరు సమానులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసీ పండరిరెడ్డి, బాబురావు టీచర్, కిషన్‌రావు టీచర్, గోవింద్‌రావు టీచర్, జైపాల్‌రెడ్డి, సంజీవరావు మాజీ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో శివాజీ చత్రపతి జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 283 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను జూకల్ శివారులో గల కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులకే ఆయా సంక్షేమ పథకాలు అందజేశారని విమర్శించారు. సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే రెండు పథకాలు అమలుచేశారని తెలిపారు. మహిళలకు ఉచితంగా బస్సుల్లో ప్రయాణ పథకం ప్రవేశపెట్టారని అన్నారు. త్వరలో మిగిలిన పథకాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని చెప్పారు. కాంగ్రెస్‌పాలనలో ప్రతి బీద బడుగు వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.





కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి

**గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి...**

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండలం నర్సాపూర్ గ్రామంలో సోమవారం సీసీ రోడ్ల పనులకు భూమి పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిగ్రామంలో రోడ్లనిర్మాణానికి నిధులు కేటాయించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి సిద్దంగా ఉన్నారని అన్నారు. అధికారులు నాయకులు కలిసి ప్రజలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నగేష్, ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, పాల్గొన్నారు.



చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అశోక్‌గౌడ్

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**నర్సాపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** నర్సాపూర్‌లో సోమవారం మహారాజ్ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్ పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబళ్ల బిక్షపతి, మున్సిపల్ కౌన్సిలర్ పంబళ్ళ రాంచందర్, నాయకులు బాల్‌రెడ్డి, నాగేశ్, ఆంజనేయులుగౌడ్, కొండి కుమార్, ప్రభాకర్, అశోక్, పాల్గొన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, కౌన్సిలర్ గోద రాజేందర్, కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, సురేశ్ తదితరులు నర్సాపూర్ లోని 4వ వార్డు ల్లోగల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ హిందూ ధర్మ రక్షణకు కృషి చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, శివాలయ పూజారి వీరప్ప గురుజీ, బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ హెచ్‌వి.రమణారావు, కౌన్సిలర్ ఎరుకలి యాదగిరి. గుండం శంకర్, బాదె బాల్‌రాజు, లాయర్ అనంద్‌కుమార్, అశోక్, శివస్వాములు పాల్గొన్నారు. కాగా రుస్తుంపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్టించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కొండాపూంలో గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగానివాళులర్పించారు

**మునిపల్లి మండలంలో...**



కంకోల్‌లో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

**మునిపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఛత్రపతి శివాజీమహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కంకోల్ గ్రామంలో జయంతి వేడుకలు ఆర్భాటంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు, నాగేష్, తుల్జారాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ శివాజీ అడుగుజాడల్లో నడవాలి

**మునిపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండలంలోని పెద్ద చెల్మెడలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని పీఠాధిపతులు 108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి (ధనసిరి), బసవలింగ అవధూత మహారాజ్(మల్లన్నగట్టు, ఝరాసంగం మండలం), బాలరాజ్ మహారాజ్(అంతారం)లు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహర్షులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రాధాబాయి జ్యోషి, మాజీ సర్పంచులు ప్రభు పాటిల్, శంకర్, వివాజీ సేన సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతులు



ఆర్డీవో రాజుకు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు

## ఆర్‌డిఓ రాజుకు స్వాగతం పలికిన సిబ్బంది

**జహీరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ ఆర్‌డిఓగా ఎస్ రాజు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న రాజును రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన రాజుకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లా హుజురాబాద్ ఆర్డీఓగా విధులు నిర్వహించిన రాజును జహీరాబాద్ డివిజన్‌కు బదిలీ చేయగా సోమవారం రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు జహీరాబాద్ ఆర్డీఓగా సేవలు అందించిన వెంకారెడ్డి శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

## బిఆర్ఎస్ డిమాండ్‌తోనే మాజీ ప్రధానికి భారతరత్న : కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాన మంత్రి పివి నర్సింహారావుకు బిఆర్ఎస్ డిమాండ్‌తోనే కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చిందని భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలను ఆకాశమంత ఎత్తుకు ఎగరేసిన తెలంగాణ బిడ్డ మాజీ ప్రధానమంత్రి, ఆర్థికమేధావి, బహుబాషా కోవిదుడు పివి నర్సింహా రావుకు భారతరత్న ప్రకటించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. పివి నర్సింహారావు కుమార్తె సురభివాణికి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పదవిని అప్పగించిందని గుర్తు చేశారు.

## క్రీడా సామాగ్రికి కాంగ్రెస్ నేత ఆర్థిక సహాయం

**మునిపల్లి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మునిపల్లిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు అవసరమైన క్రీడా సమాగ్రి కొనుగోలుకు కాంగ్రెస్ నేత రేగోటి నరేష్ కుమార్ సోమవారం ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడా సామాగ్రి కొనుగోలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డికి ఆర్థిక సహాయం అందచేశారు. క్రీడా సామాగ్రి కొనుగోలుకు ఆర్థిక సహాయం చేసిన రేగోటి నరేష్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిటిఈ మన్సూర్, ఉపాధ్యాయులు, మాజీ ఎంపిటిసి సభ్యులు సుధాకర్‌రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా శివాజీ జయంతి ఉత్సవాలు

### -పట్టణంలో భారీ ర్యాలీ, ఊరేగింపు

**జహీరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని జాతీయ రహదారిపై గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. జాతీయ రహదారి గుండా బస్టాండ్ మీదుగా శివాజీ విగ్రహం (యం బాగారెడ్డి చౌరస్తా) వరకు యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంరద్భంగా ఛత్రపతి శివాజీకి జై కొట్టడంతో జాతీయ రహదారి శివాజీ నామస్మరణతో దద్దరిల్లింది. యువకలు నృత్యులు చేస్తూ ఉత్సాహ భరితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డిసిసిబి చైర్మన్, బిజెపి నాయకులు యం జైపాల్‌రెడ్డి, మాజీ టిఎస్ ఐడిసి చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, నాయకులు గుండప్ప, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో శివాజీ మహారాజ్ జయంతి ర్యాలీని నిర్వహిస్తున్న యువత

# గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలి

### మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**పాపన్నపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం ఎంపిపి అధ్యక్షులు చందనా రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తందని గుర్తుచేశారు. ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటానన్నారు. కొత్తపల్లి గ్రామ శివారులోని వంతెన వద్ద ఇరువైపులా తారు రోడ్డు లేక పోవడంతో దుమ్ము లేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పాపన్నపేట ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్ సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎంపిడిఓ సుబ్రమణ్యం, ఎంపిపి ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కుబేరుడు, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, ఎంపిటిసి సభ్యులు, ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ...**

మల్లంపేటలో శివాజీ విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే రోహిత్‌రావు భూమి పూజ చేశారు. గాంధారిపల్లిలో ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు, శానాయిపల్లిలో బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



నాగల్‌గిద్దలో శివాజీ జయంతి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సోమవారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చత్రపలి శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించి జై శివాజీ జై జై శివాజీ అంటూ నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపి, టిపిసిసి ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్ శెట్కార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు సంజీవ్ పాటిల్, సుభాష్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

**కంగ్టి మండలంలో...**



కంగ్టిలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు

**కంగ్టి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు తడ్కల్, రాసోల్, తుర్కవడగామ్, బోర్గి తదితర గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కంగ్టి గ్రామంలో శివాజీ చౌక్ వద్ద జెండావిష్కరణ చేసి శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో చిన్న పేద తేడా లేకుండా ఆట పాటలతో శివాజీ విగ్రహాల వద్ద సంబురాలు జరుపుకున్నారు. జై శివాజీ జై భవాని అంటూ నినాదాలు చేశారు. ఆయా గ్రామాల్లో జయంతి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ మనోజ్‌పటేల్, శివాజీ సేన బాధ్యులు నూకల ప్రవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సా రెడ్డి, కిరణ్, సంతోష్‌రెడ్డి, రాజు పటేల్, పవన్‌సాగర్, నితిన్, కాలే రాజు, తోంట విశ్వనాథ్, సంగ్రాం, రాజు, గాదె మహేష్, పవన్‌రెడ్డి, కుర్తె జైపాల్, బర్దపూర్ అంజన్న, మహిపతి నాయక్, ప్రణయ్, గాజులే సాయి తదితరులు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**



వడ్డి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని జరుపుకుంటున్న యువకులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు మండలంలోని వడ్డి, గంగ్వార్ తదితర గ్రామాల్లో సోమవారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను యువకులు ఘనంగా జరుపుకున్నారు. న్యాల్‌కల్‌లోని శివాజీ విగ్రహానికి, ఆయా గ్రామాల్లో శివాజీ మహారాజ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

**ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో...**



చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్

**రామాయంపేట, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి శివాజీ హిందూ ధర్మానికి చేసిన సేవలు కొనియాడారు. మున్సిపల్ చైర్మెన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి, ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని హిందువుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి శివాజీ అని ఆయన అడుగుజాడలలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సోమవారం శివాజీ సర్కిల్లో శివాజీమహారాజ్ జయంతి ఉత్సవాలు ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. ఈకార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం, ఛత్రపతి యువసేన అధ్యక్షులు కన్నాపురం కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులు నవాత్ మహేష్, పటేరి రాము, సహాయ కార్యదర్శి బొందుగుల రాజు, నవాత్ ప్రసాద్, స్వామిగౌడ్, నవాత్ నవీన్, పచ్చుంటి రాము, చింటు, సందీప్, బీఆర్ఎస్ నాయకులు చింతల రాములు పాల్గొన్నారు.

## నర్సరీలలో మొక్కలు పెంచేందుకు కృషి చేయాలి

### ఎంపిడివో మాధవీ లత

**నర్సాపూర్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన నర్సరీలలో మొక్కలు పెంచేందుక నిర్వాహకులు కృషి చేయాలని ఎంపిడివో మాధీవీలత అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని రాంచంద్రాపూర్, మాదాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలు పెంచాలన్నారు. నర్సరీలలో మొక్కలు పెంచినట్లయితేనే హరితహారంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం జోరుగా సాగుతుందన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని మొత్తం 34 గ్రామపంచాయతీలను సందర్శించి నర్సరీలను పరిశీలిస్తానని ఆమె తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలలో అనుకన్న లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలని అన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి వాటిని రక్షిస్తే పర్యావరణం బాగుంటుందని మాధవీ లత వెల్లడించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపిడివో మాధవీలత